సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 24 । ఆగస్టు । 2023



'కారు'కు రోడ్డు వేసిందే కాంగ్రెస్..

మేము పెట్టిన భిక్షతోనే బతుకుతున్నారంటూ పరోక్షంగా బీఆర్ఎస్ అధినాయకత్వంపై రేణుకాచౌదరి ధ్వజమెత్తారు. 10లో



బీసీలకు అండగా ఉంటా..

బలహీనవర్గాలకు అండగా ఉంటానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. 12లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నది. రోజంతా మబ్బులు ఏర్పడతాయి.

న్యూస్‌రీల్

రేపు 'వరలక్ష్మీ వ్రత' పూజలు

26 నుంచి 31 వరకు నిత్యకల్యాణం నిలిపివేత



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 25న శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు రామాలయంలో బేడా మండపంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పూజల్లో పాల్గొనేందుకు రూ.200 చెల్లించాలని తెలిపారు. 26 నుంచి 31 వరకు ఆలయంలో జరిగే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని స్వామివారి నిత్యకల్యాణాలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

రామయ్యకు స్నపన తిరుమంజనం

రామాలయంలో బుధవారం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువు దీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెంటౌన్: సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజీ పడదలిచిన క్రిమినల్, సివిల్, మనోవర్తి, మోటార్ వాహన ప్రమాద, బ్యాంకు కేసులు పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.భానుమతి, జడ్జి ఏ.నీరజ, ఏ.సుచరిత, కొత్తగూడెం బార్ అసోసియేషన్ బాధ్యులు దుంద్ర రమేష్, రావిలాల రామారావు, కాసాని రమేష్, సీనియర్ న్యాయవాదులు పలివెల సాంబశివరావు, కిషన్‌రావు, శివరాం ప్రసాద్, ఎస్వీ రామారావు, భాగం మాదవరావు, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు 'అణుశక్తి, జలవనరుల శాఖ' భేటీ

సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ ఎన్‌ఓసీపై చర్చ

అశ్వాపురం: సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతులకు సంబంధించిన ఎన్‌ఓసీపై గురువారం ముంబైలో అణుశక్తి మండలి అధికారులతో జలవనరుల శాఖ అధికారులు సమావేశం కానున్నారు. జలవనరుల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి భేటీకి హాజరుకానున్నారు. సీతమ్మ సాగర్ బ్యారేజీ సమీపంలోనే మణుగూరు భారజల కర్మాగారం ఇన్‌టేక్‌వెల్ ఉంది. ఈ నేపథ్యంలో బ్యారేజీ నిర్మాణానికి అణుశక్తి మండలి నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) జారీ చేయాల్సి ఉంది. ఇప్పటికే ఇన్‌టేక్ వెల్ ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టారు. ఇటీవల ప్రత్యామ్నాయ చర్యలపై అణుశక్తి మండలి అధికారులు సమీక్షించారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పర్యావరణ మదింపు కమిటీ(ఈఏసీ) అనుమతులు రావాలంటే అణుశక్తి మండలి అనుమతులు రావాల్సి ఉంది. జలవనరుల శాఖ అధికారులు పంపిన నివేదనను మణుగూరు భారజల కర్మాగారం అధికారులు అణుశక్తి మండలికి, అక్కడి అధికారుల పరిశీలనలో ఉంది. నేడు జరిగే సమావేశంలో ఎన్‌ఓసీపై సమగ్రంగా చర్చించి అనుమతులు ఇవ్వాలని కోరనున్నారు. ఈ వారంలో జరిగే అణుశక్తి మండలి సమావేశంలో ఎన్‌ఓసీ జారీ చేయనున్నట్టు సమాచారం.

చంద్రయాన్ సంబరాలు జరపాలి

కొత్తగూడెంఅర్బన్: చంద్రయాన్–3 విజయవంతమైన ప్రక్రియను విద్యార్థులకు వివరిస్తూ పాఠశాలల్లో గురువారం ప్రార్థన సమయంలో విజయోత్సవ సంబురాలు నిర్వహించాలని జిల్లా విద్యాధికారి ఇ.సోమశేఖరశర్మ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. విక్రమ్ ల్యాండర్ చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగిడిన మొట్టమొదటి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని, ఇస్రో సాధించిన ఘనతను చాటుతూ అన్ని పాఠశాలల్లో విజయోత్సవ సంబురాలు జరపాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆరని చిచ్చు



ఇల్లెందు గులాబీదళంలో చల్లారని అసమ్మతి జ్వాలలు

- వర్గపోరుపై గుర్రుగా ఉన్న పార్టీ పెద్దలు
- గెలుపే లక్ష్యంగా పని చేయాలంటూ సూచన
- భద్రాచలంలో ప్రచారం ప్రారంభించిన తెల్లం



హరిప్రియ



వెంకటేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన రాజకీయ పార్టీలకంటే ముందుగానే అధికార బీఆర్ఎస్ పార్టీ జిల్లాలోని అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కొన్ని నియోజకవర్గాల్లో అసమ్మతి చెలరేగినా మరికొన్ని చోట్ల కొత్త ముఖాలు తమకు అవకాశం ఇవ్వాలని కోరినా వాటిని అధిష్టానం పరిగణనలోకి తీసుకోలేదు. తిరిగి సిట్టింగులనే ఎన్నికల బరిలో నిలపాలని నిర్ణయించింది. జిల్లాలో ముందు నుంచి అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాల్లో పార్టీపరంగా వర్గపోరు జాడలు లేవు. ఏడాది కాలంగా కొత్తగూడెం నియోజకవర్గంలో తీవ్రస్థాయిలో వర్గపోరు కనిపించింది. ఇల్లెందు నియోజకవర్గంలోనూ పార్టీ పరంగా కొంత ఒడిదుడుకులు ఉన్నాయి. అన్ని చోట్ల సిట్టింగులకే టికెట్లు ఇవ్వడంతో అసమ్మతి నేతలంతా గప్‌చుప్ అయ్యారు. ఇల్లెందు పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. పార్టీ నేతలు, కేడర్‌ను ఒక్కతాటిపై తీసుకురావడంలో ఆశించిన స్థాయిలో హరిప్రియా నాయక్ సఫలం కాలేకపోతున్నారనే అభిప్రాయం పార్టీవర్గాల్లో నెలకొంది. ఇక భద్రాచలంలో గెలుపే లక్ష్యంగా తెల్లం వెంకట్రావు మద్దతుదారులను కూడగట్టుకునే పనిలో పడ్డారు.

మున్సిపాలిటీ ముందు మెరుపు ధర్నా..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభ్యర్థుల జాబితాను ప్రకటించడానికి ముందు సిట్టింగ్ ఎమ్మెల్యే హరిప్రియానాయక్‌కు టికెట్ ఇవ్వొద్దంటూ ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు(డీవీ) తన గళం వినిపించారు. అయితే తీవ్ర ఉత్కంఠ మధ్య హరిప్రియనాయక్‌కే టికెట్ దక్కింది. దీంతో రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీలో అసమ్మతిని తగ్గించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తారనే అంచనాలు ఏర్పడ్డాయి. కానీ మరోసారి ఇక్కడ వర్గపోరు భగ్గుమంది. డీవీని టార్గెట్ చేస్తూ కొందరు మున్సిపల్ కౌన్సిలర్లు వాట్సాప్‌లలో సందేశాలు పంపడం చర్చనీయాంశంగా మారింది. తమ కుటుంబాన్ని మానసికంగా వేధిస్తున్నారంటూ చైర్మన్ డీవీ సతీమణి బేబీ భార్గవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరోవైపు డీవీ భాగస్వామిగా ఉన్న కాలేజీలో ఓ విద్యార్థిని అకారణంగా కొట్టారంటూ కాలేజీ యాజమాన్యంపై మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసుల విచారణ పోలీస్ స్టేషన్‌లో కొనసాగుతుండగానే తమకు మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదంటూ పారిశుద్ధ్య కార్మికులు బుధవారం ఉదయం మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా మెరుపు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గళం విప్పినందుకే డీవీని టార్గెట్ చేశారనే అభిప్రాయం నియోజవకర్గ కేంద్రంలో నెలకొంది.

రూటు మార్చిన తెల్లం



బోదబోయిన బుచ్చయ్యను కలిసిన తెల్లం

గత అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన తెల్లం వెంకట్రావు ఓటమి చెందారు. ఆ సమయంలో తన గెలుపు కోసం ప్రచారం చేసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శ తెల్లం వెంకట్రావుపై ఉంది. దీంతో మలి ప్రయత్నంలో విజయమే లక్ష్యంగా తెల్లం, తన పనితీరులో మార్పులు చేసుకున్నారనే అభిప్రాయం భద్రాచలం బీఆర్ఎస్ నేతల నుంచి వినిపిస్తోంది. భద్రాచలం నుంచి బీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడిన బోదబోయిన బుచ్చయ్య, మానె రామకృష్ణలను బుధవారం తెల్లం వెంకట్రావు కలిశారు. వ్యక్తిగతంతా వారి ఆఫీసు, ఇళ్లకు వెళ్లారు. రాబోయే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. తెల్లంకు టికెట్ ఇవ్వొద్దంటూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌లను ఇటీవల తన మద్దతుదారులతో కలిసి బోదబోయిన బుచ్చయ్య కోరారు. టికెట్ ప్రకటన వెలువడిన తర్వాత మానె రామకృష్ణను కలిసేందుకు రెండుసార్లు ప్రయత్నించి తెల్లం విఫలమయ్యారు. అయినా పట్టువదలకుండా మూడో ప్రయత్నంలో సఫలమయ్యారు. మొత్తంగా ఈసారి ఎన్నికల్లో గెలుపు కోసం చెమటోడ్చేందుకు తెల్లం వెంకట్రావు రెడీ అయ్యారనే భావన పార్టీ వర్గాల్లో కలుగుతోంది.

రంగంలోకి పార్టీ పెద్దలు..?

రాబోయే ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లకుండా ఇల్లెందు నేతలు ఆధిపత్య పోరులో మునిగిపోవడంపై పార్టీ పెద్దలు గుర్రుగా ఉన్నారు. విబేధాలు పక్కన పెట్టి రాబోయే ఎన్నికల్లో హరిప్రియ గెలుపు కోసం అందరూ కృషి చేయాలని, అదేవిధంగా అసమ్మతి అన్ని చోట్ల ఉంటుందని, మాట్లాడి సమస్యను పరిష్కరించుకుని ముందుకు వెళ్లాలి తప్పితే, పార్టీలోని నేతలను టార్గెట్ చేసి ఇబ్బంది పెట్టొద్దని ఇరువర్గాలకు సూచించినట్టు సమాచారం. ఇల్లెందులో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందనే అభిప్రాయం నెలకొంది. దీంతో ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఏకంగా యాభై మందికి పైగా ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇల్లెందులో అంతర్గత పోరును చల్లార్చేందుకు పార్టీ పెద్దలు త్వరలోనే రంగంలోకి దిగుతారని తెలుస్తోంది.

పాల్వంచ రూరల్: కిన్నెరసాని గిరిజన గురుకులంలో.



చంద్రయాన్–3 విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇస్రో శాస్త్రవేత్తల కృషిపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ అపురూప దృశ్యాలను వీక్షించారు.



11లో

ఓటరుగా నమోదు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతీ ఒక్కరు నూతన ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నూతన ఓటరు నమోదు, ఓటరు ముసాయిదా పరిశీలన, ప్రత్యేక క్యాంపుల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, పోలింగ్ ఏజెంట్ల నియామకం తదితర విషయాలపై చర్చించారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

సమగ్ర అవగాహనతో అధికారులు ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 26, 27 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్‌లో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని అన్నారు. విధులకు గైర్హాజరైతే ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పదిహేను రోజులకోసారి ఏర్పాట్లపై సమావేశం నిర్వహిస్తామని, సమస్యలు ఉన్నచోట పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు శిరీష, మంగీలాల్, ఎస్‌డీసీ కాశయ్య, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ప్రసాద్, రంగాప్రసాద్, మాస్టర్ ట్రైనర్లు సాయికృష్ణ, కిరణ్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

5 నాటికి పూర్తి చేయాలి

మన ఊరు మన బడి కార్యక్రమంలో చేపట్టిన పాఠశాలల మరమ్మతులు సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పూర్తి కావాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశపు హాలులో బుధవారం పనుల ప్రగతిపై డీఆర్డీఓ, విద్య, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, డీఈఓ సోమశేఖరశర్మ, పర్యవేక్షణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన పెంపొందించాలి



విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటిన డైరెక్టర్ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన పెంపొందించాలని సింగరేణి డైరెక్టర్ (పా) ఎస్.బలరామ్ సూచించారు. కొత్తగూడెం సింగరేణి పాఠశాల, సింగరేణి జూనియర్, డిగ్రీ కళాశాలల్లో బుధవారం పర్యావరణ క్యాప్టెన్లను ఎంపిక చేసి బ్యాడ్జీలు అందజేశారు. అనంతరం మేరా మాటి, మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించి ఆయా ప్రాంతాల్లో మట్టి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో ఒక రోజు విద్యార్థులకు మొక్కల పెంపకంపై విద్యార్థులకు డిబేట్ నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులు తమ ఇళ్ల, పరిసరాల్లో మొక్కలు నాటాలని, తల్లితండ్రులకు కూడా పర్యావరణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భ జలవనరులను సంరక్షించాలని చెప్పారు. సింగరేణి పాఠశాలల్లో అజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు ఎస్.వెంకటేశ్వరరావు, బెనెడిట్ నికోలస్, వరప్రసాద్, ప్రిన్సిపాల్స్ సీహెచ్ శారద, సంధ్యారాణి, హెచ్‌ఎం ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

జీకే ఓసీలో..

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలోని జీకే ఓసీని సింగరేణి డైరెక్టర్(పీపీ) జి.వెంకటేశ్వరరెడ్డి బుధవారం సందర్శించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా తీరును పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా బొగ్గు ఉత్పత్తి రవాణాకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు జాన్ ఆనంద్, మల్లారపు మల్లయ్య, పి. శ్రీనివాసు, ప్రహ్లాద్, బొల్లం వెంకటేశ్వర్లు, శివశంకర్, చిన్నయ్య, పూర్ణచందర్, సౌరబ్ సుమన్ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. బుధవారం కోనేరు సత్యనారాయణ నివాసంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన సత్యనారాయణ బీఆర్ఎస్‌లో చేరితో పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఏ పార్టీలోనైనా టికెట్ ఇచ్చే వరకే పోటీ ఉంటుందని, ఆ తర్వాత అందరూ కలిసి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేస్తారని అన్నారు. ముఖ్యమంత్రి ఆహ్వానం, హామీతోపాటు కాంగ్రెస్ బలోపేతం కావొద్దనే ఉద్దేశంతోనే తాను బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు కోనేరు సత్యనారాయణ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, డైరెక్టర్ మోరె భాస్కర్, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి షేక్ అన్వర్, నాయకులు యూసుఫ్, చందునాయక్, మోరె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో విప్ భేటీ

కలెక్టర్ చాంబర్‌లో బుధవారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలతో భేటీ అయ్యారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. కాగా చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం అద్భుత ఘట్టమని రేగా వేరొక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కొత్తగూడెంఅర్బన్: పోటీ పరీక్షల అభ్యర్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. బుధవారం ఆయన జిల్లా గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. పాఠకులతో మాట్లాడారు. ఇటీవల విడుదలైన ఎస్ఐ ఫలితాల్లో గ్రంథాలయంపై ఆధారపడి చదివిన ముగ్గురుకు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని చెప్పారు. అనంతరం కాంతారావును గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్ తదితరులు సన్మానించారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రుల ప్రధాన కార్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రులలో గైనకాలజీ, అనస్థీషియా, రేడియాలజీ, జనరల్ సర్జన్, పిల్లల నిపుణులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 2వ తేదీ లోగా జిల్లా ఆస్పత్రుల ప్రధాన కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

దరఖాస్తుల దౌడ్ !

- గాంధీభవన్‌కు పోటాపోటీగా ఆశావహులు
- ఈ నెల 25తో ముగియనున్న గడువు
- మూడు జనరల్ స్థానాలకు పొంగులేటి
- ఖమ్మం, పాలేరుకు మువ్వా దరఖాస్తు
- ఈ ప్రక్రియ పూర్తి చేసి టికెట్ కోసం వేట





ఇల్లెందు, అశ్వారావుపేట అభ్యర్థిత్వాల కోసం దరఖాస్తు చేస్తున్న కోరం కనకయ్య, ఆదినారాయణ

సాక్షిప్రతినిధి,ఖమ్మం: కాంగ్రెస్ పార్టీలో దరఖాస్తుల దౌడ్ నెలకొంది. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి జిల్లాలోని ఆశావహులు గాంధీభవన్ బాట పట్టారు. ఈనెల 18 నుంచి టీపీసీసీ.. ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా ఈ ప్రక్రియ 25తో ముగియనుంది. దీంతో ఆశావహులు దరఖాస్తు చేసుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇక ప్రక్రియ ముగిసిన వారంతా టికెట్ కోసం తమ ప్రయత్నాల్లో మునిగారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు పోటాపోటీగా దరఖాస్తులు చేశారు.

మూడింట పొంగులేటి..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి జిల్లాలోని మూడు జనరల్ స్థానాలైన పాలేరు, ఖమ్మం, కొత్తగూడెంలో ఎక్కడి నుంచి బరిలో ఉంటారన్నది రాజకీయ శ్రేణుల్లో ఆసక్తిగా మారింది. అయితే పొంగులేటి తరఫున ఆయన అనుచరులు మూడు స్థానాలకు బుధవారం గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. దీంతో మారుతున్న రాజకీయ సమీకరణలతో చివరకు ఆయన ఏ స్థానంలో ఉంటారన్నది త్వరలో తేలనుంది. అయితే పలు స్థానాలకు ఆయన అనుచరులు దరఖాస్తులు చేశారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు మువ్వా విజయబాబు, వైరా నియోజకవర్గం నుంచి విజయబాయి, సత్తుపల్లి నుంచి కొండూరు సుధాకర్, అశ్వారావుపేట నియోజకవర్గానికి జారె ఆదినారాయణ, పినపాకకు పాయం వెంకటేశ్వర్లు, ఇల్లెందుకు భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య దరఖాస్తులు అందజేశారు. అలాగే పొంగులేటి అనుచరులు శేరిలింగంపల్లి నియోజకవర్గానికి రఘునాథ్‌యాదవ్, చెన్నూరుకు డాక్టర్ రాజారమేష్, కంటోన్మెంట్‌కు పిడమర్తి రవి, మహేశ్వరం నియోజకవర్గానికి కొత్త మనోహర్‌రెడ్డి దరఖాస్తులు అందజేశారు.

వైరా, సత్తుపల్లికి పోటా పోటీ..

ఇప్పటి వరకు వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు ఆశావహులు ఎక్కువ మంది దరఖాస్తులు ఇచ్చారు. వైరా నియోజవర్గానికి దరఖాస్తు చేసుకున్న వారిలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అనుచరులు బానోతు బాలాజీ, మాలోతు రాందాస్‌నాయక్, రామ్మూర్తినాయక్, పాలకుర్తి నాగేశ్వరరావు ఉన్నారు. అలాగే సత్తుపల్లికి మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, కోటూరి మానవతారాయ్, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, కొండూరు సుధాకర్, డాక్టర్ మట్టాదయానంద్, ఆయన భార్య రాగమయి దరఖాస్తు చేశారు. ఖమ్మంరూరల్ మండలం ఆరెంపుల సర్పంచ్ చింతమల్ల పద్మ, ఆమె భర్త చింతమల్ల రవి కూడా సత్తుపల్లి స్థానానికి దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. పాలేరు నుంచి ఇప్పటివరకు మద్ది శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌యాదవ్ దరఖాస్తులు ఇచ్చారు. రాయల నాగేశ్వరరావు నేడో, రేపో దరఖాస్తు చేయనున్నారు. తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన బెల్లం శ్రీనివాస్ కూడా దరఖాస్తు చేసిన వారిలో ఉన్నారు. మధిర నియోజకవర్గానికి భట్టివిక్రమార్క తన దరఖాస్తును అనుచరులతో ఇప్పించనున్నారు.

ఈ రెండు రోజుల్లో ఇంకొన్ని..

దరఖాస్తు చేసుకుంటేనే టికెట్ల పరిశీలన జరుగుతుందన్న టీపీసీసీ ఆదేశాలతో ఆశావహులంతా గతంలో వారు చేసిన కార్యక్రమాలను వివరంగా పేర్కొంటూ దరఖాస్తు చేస్తున్నారు. ఈ నెల 25తో గడువు ముగియనుండడంతో ఆశావహులు మిగిలిన ఈ రెండు రోజుల్లో దరఖాస్తుల తంతు ముగించే పనిలో పడ్డారు. అయితే ముఖ్య నేతలు మాత్రం వ్యూహాత్మకంగా పలు చోట్ల తమ అనుచరులు ఇద్దరు, ముగ్గురితో దరఖాస్తులు చేయించడం గమనార్హం. టికెట్ల ప్రకటన నాటికి మారే రాజకీయ సమీకరణలతో ఏదైనా జరగొచ్చన్న ముందు చూపుతో ఈ విధంగా దరఖాస్తులు చేయిస్తున్నారు. బీఆర్ఎస్‌లో టికెట్ దక్కని ఆశావహులు కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారంతో.. కాంగ్రెస్‌లో ఆశావహులంతా ముందస్తుగా దరఖాస్తు చేసి టికెట్ల వేటలో పడ్డారు.

సర్వేలే కీలకం..

ఉమ్మడి జిల్లాలోని ముఖ్య నేతల అనుచరులు ఎవరికివారు దరఖాస్తు చేసినా.. ఈ సారి సర్వేలను కీలకంగా చేసుకొని పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఎంపిక చేస్తుందని ఇప్పటికే పలుమార్లు టీపీసీసీ పెద్దలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో సర్వేల్లో తమ పనితీరు ఎలా ఉందోనన్న ఆందోళన ఆశావహుల్లో ఉంది. ఇప్పటికే పలుమార్లు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సర్వే చేయించింది. ఇందులో ఆశావహుల్లో ఎవరు బెటర్, వారికి ప్రజలతో ఉన్న సత్సంబంధాలు తదితర వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఈ సర్వే ఆధారంగానే ఆశావహుల దరఖాస్తులను అన్ని కోణాల్లో పరిశీలించి అభ్యర్థిత్వం ఖరారు చేయనున్నట్లు సమాచారం. అధిష్టానం ప్రక్రియ ఎలా ఉన్నా దరఖాస్తు చేసిన ఆశావహులంతా టికెట్ తమకే ఇప్పించాలని తమ నేతల ఆశీస్సుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.

క్లుప్తంగా

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న డీఎఫ్‌ఓ



పంచవటి కుటీరంలో అటవీశాఖ అధికారులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారిని భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాల ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ నాగభూషణం బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పంచవటి కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్‌ఓలు కనకమ్మ, అబ్దుల్ రెహమాన్, పర్ణశాల ఎఫ్‌బీఓ శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

అటవీ సంరక్షణను నిర్లక్ష్యం చేయొద్దు

పాల్వంచరూరల్: అడవులు, వన్యప్రాణుల సంరక్షణను అటవీ సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్ అన్నారు. బుధవారం కిన్నెరసాని అభయారణ్యం పరిధిలోని రేగళ్ల అటవీ ప్రాంతంలోని నర్సరీలు, ప్లాంటేషన్, నీటి కుంటలను డీఎఫ్‌ఓ పరిశీలించారు. అయిన వెంట ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ జశ్వంత్ ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

టేకులపల్లి: పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. ఏఎస్‌ఐ భూక్య సూర్య కథనం ప్రకారం.. మండలంలోని బేతంపూడి గ్రామానికి చెందిన పేరం వెంకన్న (57)కు నోటిలో గడ్డ కావడంతో ఈ నెల 12న ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. ఈ నెల 21న రిపోర్టులు వస్తాయని చెప్పడంతో తిరిగి ఇంటికి వచ్చారు. ఈ నెల 21న ఉదయం భార్య అచ్చమ్మ తన భర్తకు రూ.2 వేలు ఇచ్చి ఆస్పత్రికి వెళ్లి రమ్మని చెప్పి కూలి పనులకు వెళ్లింది. ఆ డబ్బులతో వెంకన్న మద్యం సేవించాడు. తన అనారోగ్యం గురించి ఆలోచిస్తూ మనస్తాపానికి గురై పురుగుమందు తాగాడు. విషయం తెలుసుకుని ఇంటికి వచ్చిన భార్య.. స్థానికుల సాయంతో వెంకన్నను 108లో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం భార్య అచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణంలో ఇరువర్గాల ఘర్షణ

పాల్వంచరూరల్: మండలంలోని బస్వతారక కాలనీ సమీపంలో గల భూమిలో ఇళ్ల నిర్మాణం కోసం ఇరువర్గాల వారు బుధవారం ఘర్షణ పడ్డారు. ఈ విషయమై పట్టణ ఎస్‌ఐ రామును వివరణ కోరగా ఇళ్ల నిర్మాణం విషయంలో గొడవ జరుగుతున్నట్లు సమాచారం రాగా తాను ఘటనా స్థలానికి వెళ్లానని, అక్కడి నుంచి ఇరువర్గాల వారు పారిపోయారని తెలిపారు. భూతగాదా విషయమై విచారణ జరుపుతున్నామని, ఎవరూ కూడా ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ వివరించారు.

వ్యక్తిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: అక్కను హింసిస్తున్నాడని బావను కొట్టిన బావమరిదిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కార్తీక్ కథనం ప్రకారం.. మండలంలోని నాగారంకాలనీకి చెందిన బానోతు రాము తన భార్యతో మంగళవారం ఇంటి వద్ద గొడవ పడుతున్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఆదే గ్రామానికి చెందిన బావమరిది సపావత్ పవన్.. బావను కర్రతో కొట్టాడు. రాము బుధవారం ఫిర్యాదు చేయడంతో పవన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

దమ్మపేట: యువతి కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని మొండివర్రె గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యువతి ఈ నెల 18వ తేదీన ఇంట్లో నుంచి తల్లితండ్రులకు చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. దీనితో తండ్రి, బంధువులు ఆమె కోసం వెతకగా ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం

భద్రాచలంఅర్బన్: అక్రమంగా వాహనాల్లో తరలిస్తున్న పశువులను స్థానిక పోలీసులు మంగళవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఒక లారీతో పాటు మరో వాహనంలో మొత్తం 43 పశువులను తరలిస్తుండగా, వాటిలో 3 గోవులు మృతి చెంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్‌సస్టేషన్‌కు తరలించి, నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. స్థానిక ఎస్‌ఐ పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.8,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది పరారు కాగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



'ఆమె'కు భరోసా

మహిళలకు అండగా సఖీ వన్‌స్టాప్ సెంటర్

- ఫోన్ చేస్తే తక్షణమే బాధితుల వద్దకు సఖి బృందం
- మానసికంగా కుంగిపోయిన మహిళలకు కౌన్సెలింగ్
- నాలుగేళ్లలో 1,185 కేసుల్లో కేంద్రం సహాయ సహకారాలు

(సహాయం కోసం సంప్రదించాల్సిన నంబర్లు 181, 08744-248222)



కొత్తగూడెం చుంచుపల్లిలోని సఖీ వన్‌స్టాప్ సెంటర్ కార్యాలయం

కొత్తగూడెంటౌన్: మానసిక, లైంగిక, వైవాహి క సమస్యలతో బాధపడుతున్న మహిళలకు సఖీ కేంద్రం అండగా నిలుస్తోంది. 181కు ఫోన్ చేస్తే చాలు బాధితుల వద్దకు బృందం చేరుకుని తగిన సహాయం చేస్తోంది. లైంగిక, వరకట్న, గృహహింస, బాల్య వివాహాలు సమస్య ఏదైనా చట్టపరంగా, న్యాయపరమైన సహాయ సహకారాలు అందిస్తోంది. ప్రభుత్వం సఖీ కేంద్రాలను 2015, ఏప్రిల్ 1న ప్రారంభించగా, జిల్లా కేంద్రంలోని చుంచుపల్లిలో 2019లో సఖీ వన్‌స్టాప్ సెంటర్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి జిల్లాలో మహిళ సమస్యలను పరిష్కరిస్తూ విశేషసేవలు అందిస్తున్నారు. వివిధర కారణాలతో విడిపోదామనుకునే దంపతుల కేసులు తమ దగ్గరకు ఎక్కువగా వస్తున్నాయని, అయితే ఆ దంపతులు కలిసి ఉండేలా కౌన్సెలింగ్ ఇస్తున్నామని, దీంతో పొరపొచ్చాలు లేకుండా వారు కలిసి జీవిస్తున్నారని కేంద్రం బాధ్యులు చెబుతున్నారు. బాధిత మహిళలు హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 181, 08744-248222కు ఫోన్ చేస్తే వైద్యసేవలు, కౌన్సెలింగ్, పోలీస్ సేవలు, న్యాయ సేవలతోపాటు తాత్కాలిక వసతి కలిస్తామని సఖీ అడ్మినిస్ట్రేటర్ సుభాశ్రీ తెలిపారు.

నాలుగేళ్లలో 1,185 కేసులు..

2019 ఏడాది నుంచి 2023 జూలై వరకు జిల్లా వ్యాప్తంగా 1,185 కేసులు సఖీ కేంద్రానికి వచ్చాయి. వీటిలో కౌన్సెలింగ్ ద్వారా 382 కేసుల్లో రాజీ కుదిర్చారు. 612 కేసులను పరిష్కరించగా, విచారణ దశలో మరో 191 కేసులు ఉన్నాయి. బాధితుల్లో ఇంకా 169 మంది వైద్యుల పరిశీలనలో ఉన్నారు. పోలీసు శాఖ సహాయంతో 71 కేసులో విచారణలో ఉన్నాయి. సఖీ సంరక్షణలో 235 మంది సేవలు పొందుతున్నారు. సఖీ ఆధ్వర్యంలో స్వదార్ సంరక్షణకు 71 మందిని పంపినట్లు నిర్వాహకులు తెలిపారు.

రెండు, మూడు కేసులను పరిశీలిస్తే..

- కొన్నాళ్ల క్రితం మతిస్థిమితం లేని ఓ నిండు గర్భిణి మణుగూరు రైల్వే స్టేషన్‌లో దిగింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సఖీ బృందం ఆమెను చేరదీసి కొత్తగూడెం కేంద్రానికి తరలించింది. తగిన వైద్యసేలందించడంతో సుఖ ప్రసవం పొందింది. ఆ తర్వాత తల్లీబిడ్డలను ఖమ్మంలోని శిశు గృహకు తరలించారు.
- కొత్తగూడెంలో ఓ మహిళను భర్త ని త్యం వేధింపులకు గురిచేస్తున్నాడు. అవహేళనగా మాట్లాడటంతోపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నాడు. దీంతో ఆమె సఖీ కేంద్రాన్ని సంప్రదించగా, భర్తను పిలిపించి దంపతులిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పుడు వారి దాంపత్యం అన్యోన్యంగా సాగుతోంది.
- ఓ మైనర్ బాలికకు ఇష్టం లేని వివాహం చేస్తుంటే స్థానికుల ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న సఖీ బృందం సభ్యులు బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు.

ఫోన్ చేస్తే మీ ముందుంటాం



గృహహింస, లైంగిక వేధింపులకు గురయ్యే మహిళల పక్షాన నిలిచి వారి సమస్యల పరిష్కారానికి సఖీ కేంద్రం పాటుపడుతోంది. మానసికంగా కుంగిపోయి మహిళలకు, విడిపోదామనుకుంటున్న జంటలకు కౌన్సెలింగ్ ఇస్తూ కలిసి ఉండేలా చేస్తున్నారు. లైంగిక దాడులకు గురవుతున్నవారికి అండగా ఉంటాం. బాల్య వివాహాలను అడ్డుకుంటున్నాం. కొందరు యువతులు ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలను పాల్పడుతుంటారు. అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు చేపడుతున్నాం. బాధిత యువతుల మిత్రులు, బంధువులు సమస్యను గమనించి మా దృష్టికి తీసుకురండి. ఓ నిండు జీవితాన్ని కాపాడినవారవుతారు. మహిళలకు ఏ సమస్య ఉన్నా 181కు ఒక్క ఫోన్ చేస్తే మేము అండగా నిలుస్తాం.

– జిలుమూరి సుభాశ్రీ, సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్, కొత్తగూడెం

ఉలిక్కిపడిన ప్రజలు

- దుండగులు దోపిడీ చేసిన తీరుతో భయాందోళనలు
- ఇలా ఎప్పుడూ జరగలేదని చర్చ

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామానికి చెందిన పురుగుమందుల వ్యాపారి చెరుకుమల్ల రుక్కయ్య ఇంట్లోకి దుండగులు ప్రవేశించి దోపిడీ పాల్పడిన ఘటన తెలుసుకున్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో కారులో వచ్చిన నలుగురు దుండగులు వ్యాపారి రుక్కయ్య ఇంటి తలుపులు కొట్టి.. పోలీసులమని నమ్మబలికారు. వ్యాపారి రుక్కయ్య తలుపు తీయగానే నెట్టేసి లోపలకు వెళ్లారు. కత్తులను చూపిస్తూ అరిస్తే చంపుతామంటూ రుక్కయ్యను ఒక గదిలో బంధించి, అతడి భార్య రాధను బెదిరించి బీరువాల తాళాలు తీయించారు. అందులోని నగదు, బంగారు ఆభరణాలు (రూ.30 లక్షల విలువ గల) దోచుకున్నారు. కారులో డ్రైవర్ సిద్ధంగా ఉండటంతో దుండగులు అందులో పరారయ్యారని బాధిత కుటుంబం, ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ విషయం తెలియడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో ఎప్పుడూ ఇంత భారీస్థాయిలో దోపిడీ జరిగిన ఘటనలు లేవని, ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ సమయంలో దుండగులు దోపిడీకి తెగబడటంతో ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. కాగా, ఇదే గ్రామానికి చెందిన లేళ్ల గోపాల్‌రెడ్డి, వందనపు నరసింహారావుకు చెందిన రెండు బుల్లెట్లను ఇళ్ల ముందు పార్క్ చేయగా దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన నెలరోజుల కిందట చోటుచేసుకుంది. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు బుల్లెట్ల ఆచూకీ తెలియరాలేదు. రెండోసారి చోరీ జరగడం సంచలనంగా మారింది. ఇదిలా ఉండగా స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను బుధవారం జూలూరుపాడు సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ పురుషోత్తం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీసీ పుటేజీలను పరిశీలించామని, ఓ కారు వెళ్తున్నట్లు స్పష్టంగా కన్పించడం లేదన్నారు. జూలూరుపాడు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తామన్నారు. దుండగులను త్వరలోనే పట్టుకుంటామని, ప్రజలు భయపడాల్సిన పనిలేదని, అప్రమత్తతో ఉండాలని సూచించారు.

బైక్ చోరీ కేసులో విచారణ

భయంతో గొంతు కోసుకున్న అనుమానితుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగార్జున

పెనుబల్లి: అన్నపురెడ్డిపల్లి పోలీసులు బైక్ చోరీ కేసు విచారణ నిమిత్తం మండలంలోని పాతకారాయిగూడెం వచ్చి అనుమానితుడిగా భావిస్తున్న నాగార్జున ఇంటికి వెళ్లారు. దీంతో సదరు వ్యక్తి బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పాతకారాయిగూడెం గ్రామానికి చెందిన కొమ్మినేని రామకృష్ణ అలియాస్ నాగార్జున ద్విచక్రవాహనాలను చోరీ చేశాడేమోననే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి పోలీసులు అనుమానించారు. ఎస్‌ఐ షాహీనా సిబ్బందితో సివిల్ డ్రెస్సులో మంగళవారం రాత్రి పెనుబల్లి మండలంలోని పాతకారాయిగూడెంలో నాగార్జున ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో పోలీసులకు, నాగార్జున కుటుంబ సభ్యులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో నాగార్జున ఇంట్లోకి వెళ్లి బ్లేడుతో గొంతు వద్ద కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే నాగార్జునను కుటుంబ సభ్యులు, స్థానికులు పెనుబల్లి వైద్యశాలకు తరలించి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నాగార్జున పరిస్థితి నిలకడగానే ఉంది.

చలానా ఆధారంగా..

పెనుబల్లి మండలంలోని కుప్పెనకుంట్లకు చెందిన నారుమళ్ల రవీంద్ర ఏప్రిల్ 2న తన ఇంటి ముందు ద్విచక్రవాహనాన్ని ఉంచి ఇంట్లోకి వెళ్లి భోజనం చేస్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. తర్వాత ఆ ద్విచక్రవాహనంపై ఎర్రగుంటలో ఇద్దరు వ్యక్తులు తిరుగుతూ ఉండగా పోలీసులు ఆ ద్విచక్రవాహనం ఫొటో తీసి చలానా వేశారు. రవీంద్ర సెల్‌ఫోన్‌కు ఎర్రగుంటలో తన ద్విచక్రవాహనానికి చలానా వేసిన ఫొటో రావడంతో ఈ నెల 18న ఆ ఫొటో ఆధారంగా వెళ్లి ఆ వ్యక్తిని గుర్తించాడు. ఎర్రగుంటకు చెందిన చెన్నారావు అనే వ్యక్తి తాను ద్విచక్రవాహనాన్ని పాతకారాయిగూడెం వ్యక్తి వద్ద నుంచి కుదవపెట్టుకున్నానని, తాను దొంగతనం చేయలేదని, ఆ వాహనాన్ని అన్నపురెడ్డిపల్లి పోలీసులకు అప్పగించాడు. అక్కడి నుంచి వీఎం బంజర్ పోలీసుల జోక్యంతో రవీంద్రకు అన్నపురెడ్డిపల్లి పోలీసులు ద్విచక్రవాహనాన్ని అప్పగించారు. కాగా, అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంపెనలో రెండు ద్విచక్రవాహనాలు, సామగ్రి దొంగతనం కేసులు పెండింగ్‌లో ఉండటంతో వాటిని ఏమైనా పాతకారాయిగూడెం గ్రామానికి చెందిన నాగార్జున దొంగిలించాడేమోనన్న అనుమానంతో ఎస్‌ఐ షాహీనా మంగళవారం రాత్రి విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే నాగార్జున బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వీఎం బంజర్ ఎస్‌ఐ సూరజ్ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఏఎస్పీ పారితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం ఏఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ లాడ్జిల యజమానులు, నిర్వాహకులతో భద్రాచలం ఏఎస్పీ పారితోష్ పంకజ్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ లాడ్జీల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని, లాడ్జిలో అనుమానాస్పద విషయాలు ఏమైనా గ్రహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు సహకరిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వస్తే లాడ్జి యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జికి వచ్చే వారి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం సీఐ నాగరాజురెడ్డి, ఎస్‌ఐ మధుప్రసాద్, భద్రాచలం లాడ్జిల యజమానులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు హెల్త్‌కార్డులు



హెల్త్ కార్డులు అందజేస్తున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్ట్ ఆవరణలో న్యాయవాదులకు బుధవారం మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు చేతులమీదుగా హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ.. రాష్ట్ర బార్ కౌన్సిల్ న్యాయవాదుల సంక్షేమం, ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధతో హెల్త్ కార్డులు అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, కె.నర్సింహారావు, కిషన్, బి.శ్రీనివాస్, సూర్యం, శైలజ, కవిత, సంధ్య, సావిత్రి పాల్గొన్నారు.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను వెల్లడిస్తున్న దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో వివిధి కేడర్లలో ఉన్న 14 మంది మావోయిస్టులు జిల్లా పోలీసుల ఎదుట బుధవారం లొంగిపోయారు. జిల్లా ఎస్పీ గౌరవ్‌రాయ్ కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులను జనజీవన స్రవంతిలో కలిపేందుకు ఏర్పాటు చేసిన లోన్‌వర్రాట్ (ఇంటికి తిరిగి రండి) కార్యక్రమానికి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 629 మంది మావోయిస్టులు లొంగిపోగా వారిలో రివార్డులు ఉన్న 161 మంది ఉన్నారని, తాజాగా 14 మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరఫున అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని ఎస్పీ వివరించారు.

ఆస్తి ఇవ్వడం లేదని వ్యక్తి ఆత్మహత్య

చండ్రుగొండ: కులాంతర వివాహం చేసుకున్న కారణంగా కుటుంబ సభ్యులు ఆస్తి పంపకాల విషయంలో తనకు వాట ఇవ్వడం లేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మంగయ్యబంజర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మంగయ్యబంజర్ గ్రామానికి చెందిన పూరేటి శివ (35) పదిహేనేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన బానోత్ విజయను పేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రేమ వివాహం చేసుకున్నాడనే అక్కసుతో కుటుంబ సభ్యులు ఆస్తిలో వాటా ఇవ్వమని చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన అతడు బుధవారం పురుగులమందు తాగాడు. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు తల్లి మంగమ్మ, సోదరుడు నరేశ్, మేనమామ మేకల సుబ్బారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

చండ్రుగొండ: మండలంలోని తుంగారం గ్రామానికి చెందిన ఆళ్ల మల్లేశ్ (28) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగులమందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించే మల్లేశ్ ఇటీవలికాలంలో అప్పులపాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు భరించలేక పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాచినేని రవి తెలిపారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

అశ్వారావుపేటరూరల్: బాలికపై, బాలుడు లైంగికదాడికి యత్నించిన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై, అదే గ్రామానికి చెందిన ఓ బాలుడు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలోనే లైంగికదాడికి యత్నించగా, భయాందోళనకు గురైన బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాజీ సర్పంచ్‌ను గాయపరచిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో గత ఆదివారం రాత్రి 40 మందిని అదుపులోకి తీసుకున్న మావోయిస్టులు వారిలో 39 మందిని మరుసటి రోజు విడిచిపెట్టగా కుట్రు మాజీ సర్పంచ్ మహేశ్‌కుమార్ గోటాను మాత్రం వదిలిపెట్టలేదు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ తీవ్రంగా కొట్టారు. పదునైన ఆయుధాలతో గాయపరచారు. మంగళవారం రాత్రి సోమనపల్లి సమీపంలోని ప్రధాన రహదారి పక్కన పడేశారు. ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో అతడిని బీజాపూర్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రాయ్‌పూర్‌కు.. అక్కడి నుంచి బుధవారం సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఢిల్లీకి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.

'కారు'కు రోడ్డు వేసిందే కాంగ్రెస్..

- ఏ హక్కుతో ఓట్లు అడుగుతారు
- కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి



సభలో మాట్లాడుతున్న రేణుకాచౌదరి

కొత్తగూడెంరూరల్: 'నీవు వెళ్లే రోడ్డు వేసింది మేమే.. నీవు కట్టుకున్న ఇంటికి స్థలం ఇచ్చింది మేమే.. మొత్తంగా 'కారు' తిరిగేందుకు మార్గం చూపింది మేమే.. మేము పెట్టిన భిక్షతోనే ఇప్పుడు బతుకుతూ మమ్మల్నే అంటారా?' అంటూ.. పరోక్షంగా బీఆర్ఎస్ అధినాయకత్వంపై కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రేణుకాచౌదరి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుంచి కొత్తగూడెంక్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేణుకాచౌదరి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కొత్తగూడెం అభ్యర్థిగా ప్రకటించిన వ్యక్తి అన్నం పెట్టిన తల్లినే మోసం చేశాడని, ఇక అతడి కుమారుడి దుర్మార్గం వల్ల ఓ కుటుంబమే మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుందని, ఇలాంటి చరిత్ర ఉన్న వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. రేపు ఏదైనా సమస్య వస్తే ఆడవాళ్లు వాళ్లు వారి ఇంటికి వెళ్లగలుగుతారా? అని నిలదీశారు. ఇలాంటి వారు ఏ హక్కుతో ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. పావలా వడ్డీ, సున్నా వడ్డీ పెట్టింది కాంగ్రెస్ పార్టీనేనని తెలిపారు. గ్యాస్ సిలిండర్ ధర పెరగడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చదువుకునే పిల్లలు, రైతులు, కౌలు రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీసీకే టికెట్ ఇవ్వాలని అడిగారని, ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రేణుకాచౌదరి హామీ ఇచ్చారు. అనంతరం ఓబీసీ ఆల్‌ఇండియా వైస్ చైర్మన్ కత్తి వెంకటస్వామి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ, తాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. సభలో రామసహాయం మాధవీరెడ్డి, రాధాకిశోర్, రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, సకినాల వెంకటేశ్వర్లు, అంతోటి పాల్, శంకర్‌నాయక్, వెంకన్న, లక్కినేని సురేందర్ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

గుండాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులు, వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె ఆళ్లపల్లి, గుండాల మండలంలో పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. ఆళ్లపల్లి మండలం రాయపాడు, గుండాల మండలం సాయన్నపల్లి, ముత్తాపురం, నరసాపురం గ్రామాల్లో సుమారు 150 మంది రైతులకు 500 బస్తాల ఎరువులు అందించారు. ఇటీవల కురిసిన ఆకాల వర్షాలు వరదల దృష్ట్యా రైతులు కొనుగోలు చేసి నిల్వ చేసుకున్న ఎరువులు పూర్తిగా నష్టపోవడం బాధాకరమన్నారు. అనంతరం జగ్గయ్యగూడెంలో పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో బట్ట విజయగాంధీ, పొంబోయిన ముత్తయ్య, కోడెం ముత్యమాచారి, కల్తి కృష్ణారావు, ఈసం పాపారావు, దుర్గా, రమేశ్, లక్కినేని సురేందర్ రావు, భూక్య దళ్‌సింగ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

చిత్ర ప్రదర్శన ప్రారంభించిన అదనపు కలెక్టర్




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

కొత్తగూడెంఅర్బన్: ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కొత్తగూడెం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో తెలుగు స్వాతంత్య్ర సమరయోధులు, మేరా మాటి మేరా దేశ్‌పై కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న తెలుగువారిని స్మరించుకునేందుకు ఇది వేదికని తెలిపారు. ఈ ప్రదర్శన మూడు రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం విదేశీ పాలన నుంచి భారతదేశాన్ని విముక్తి చేయడానికి స్వాతంత్య్ర సమరయోధులు చేసిన త్యాగాలను ప్రస్తుత తరానికి తెలియజేయడమే ఈ ఛాయా చిత్ర ప్రదర్శన లక్ష్యం అని ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి జి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారుగా 40 ఛాయాచిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కృష్ణ వందన, హవిలా, వేణుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను తనవిగా చెప్పకుంటున్న సీఎం

మహారాష్ట్ర డిప్యూటీ స్పీకర్ సమీర్

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులను తన సొంత పథకాలుగా తెలంగాణ సీఎం కేసీఆర్ చెప్పుకుంటున్నాడని మహారాష్ట్ర డిప్యూటీ స్పీకర్ సమీర్ కూనవార్ విమర్శించారు. బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బుధ వారం స్థాని క నాయకులతో కలిసి ఆయన టేకులపల్లి మండలంలో పర్యటించారు. తొలుత సులానగర్ పీహెచ్‌సీని సందర్శించారు. ఆశవర్కర్లకు సమానపనికి సమాన వేతనం ఇవ్వడం లేదని తెలిపారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులు, పథకాలు పీహెచ్‌సీలో అమలు అవుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల భవనంలో బూత్ కమిటీ అధ్యక్షుడు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ధరావత్ బాలాజీ, వి.హత్తీరాం నాయక్, బాలగాని గోపికృష్ణ, ఊకె అబ్బయ్య, విమల్కుమార్, బోడ వుణ్య, రాంచందర్ పాల్గొన్నారు.



మూన్ గురించి.. మీకు తెలుసా?

➤ మనం అనుకు న్నట్లు.. చంద మామ గుండ్రంగా ఉండడు.. గుడ్డు ఆకారంలో ఉంటాడు.. అలాగే చల్లనయ్య.. తెల్లనయ్య కాదు.. దగ్గర్నుంచి చూస్తే.. ముదురు బూడిద రంగులో ఉంటాడు. మనం ఎప్పుడు చూసినా.. చంద్రునిలోని 59 శాతం మాత్రమే మనకు కనిపిస్తుందట. అంతేకాదు.. చంద్రుడిని దగ్గర నుంచి చూస్తే.. భారీ గుంతలులాంటివి కనిపిస్తుంటాయి. ఇవన్నీ.. కొన్ని కోట్ల ఏళ్ల క్రితం ఖగోళ వస్తువులు దాన్ని ఢీకొన్నప్పుడు ఏర్పడినవే..

ఆన్‌లైన్‌లో 'అగ్రి' సెన్సెస్

- రెవెన్యూ గ్రామం యూనిట్‌గా వ్యవసాయ గణన షురూ
- ఇతర రాష్ట్రాల్లో మాన్యువల్‌గానే...
- మన దగ్గరే యాప్ ద్వారా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌ల వినియోగం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రైతుల జీవన స్థితిగతులు..సాగు కమతాల స్వరూప స్వభావాన్ని తేల్చే వ్యవసాయగణన (అగ్రికల్చర్ సెన్సెస్) ఇటీవల దేశవ్యాప్తంగా మొదలైంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తెలంగాణలో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. భూకమతాల వారీగా రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సర్వే నిర్వహిస్తున్నారు. మొత్తం పది అంశాలపై మూడు దశల్లో వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా కాగిత రహితంగా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు వినియోగించి ప్రత్యేక యాప్ ద్వారా డిజిటల్ విధానంలో ఏఈఓలు సర్వే చేస్తుండగా, మిగతా రాష్ట్రాల్లో మాన్యువల్‌గానే చేపడుతున్నారు.

2021–22 ప్రామాణికంగా 11వసారి

దేశంలో వ్యవసాయ స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు అభివృద్ధి ప్రణాళిక, సామాజిక ఆర్థిక విధాన రూపకల్పనకు కేంద్రం ఐదేళ్లకు ఒకసారి వ్యవసాయ గణన నిర్వహిస్తోంది. 1979లో వ్యవసాయగణన మొదలుకాగా, చివరగా పదోసారి 2015–16లో చేపట్టారు. 11వ వ్యవసాయ గణన 2021–22లో జరగాల్సి ఉండగా, కరోనా తదితర కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. 2021–22 ప్రామాణిక సంవత్సరంగా ఈ నెల నుంచి వ్యవసాయానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం కొద్దిరోజుల క్రితమే ఆదేశాలు జారీ చేసింది.



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్లంలో సర్వే చేస్తున్న ఏఈఓ

మూడు దశల్లో...

వానాకాలం, యాసంగిలో ఆయా రైతుల వారీగా ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలో ఏటా వ్యవసాయశాఖ సర్వే చేస్తోంది. అయితే కేంద్రం మార్గదర్శకాల ప్రకారం మూడు విడతల్లో వ్యవసాయ గణన చేపట్టారు.

- మొదటి విడతలో రైతు పేరు, సామాజికస్థితి, సాగు విస్తీర్ణం, భూమి వినియోగం, పురుషులు, మహిళలు ఇలా అన్ని సేకరించి రెవెన్యూ గ్రామం వారీగా నమోదు చేస్తున్నారు.
- రెండో విడతలో ఎంపిక చేసిన 20 శాతం గ్రామాల్లో ప్రణాళిక శాఖ నిర్దేశించిన టీఆర్‌ఏఎస్ (టైమ్ లీ రిపోర్టెడ్ అగ్రి స్టాటిస్టిక్స్)తో పాటు అదనంగా మరికొంత సమాచారం సేకరిస్తారు.
- మూడో దశలో ఏడు శాతం గ్రామాల్లో సాగు ఖర్చులు, యంత్రాల వినియోగం, ఎరువులు, విత్తనాలు, ప్రభుత్వ రాయితీలు తదితర వివరాలు సేకరిస్తారు.

సాంకేతికతతో సర్వే...

తాజాగా రాష్ట్రంలో చేపట్టిన వ్యవసాయ గణనలో అధికారులు వందశాతం సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ విధానంలో వ్యవసాయ కమతాలు, రైతుల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే రైతుబంధు పథకానికి రైతుల నుంచి ఆధార్ కార్డులు, వ్యవసాయ భూముల విస్తీర్ణం, పంటల సాగు తదితర వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచగా, వాటి ఆధారంగా వ్యవసాయగణనలో అదనపు సమాచారం తీసుకుంటున్నారు.

ప్రణాళికకు వ్యవసాయ గణన కీలకం



వ్యవసాయ స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు ఆర్థిక విధాన రూపకల్పనకు వ్యవసాయ గణన ఎంతో ఉపయోగకరం. నిర్ణీత లక్ష్యం మేరకు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లావ్యాప్తంగా వ్యవసాయశాఖ, ప్రణాళిక శాఖ అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు.

– దశరథ్, మహబూబ్‌నగర్ జిల్లా ప్రణాళికశాఖ అధికారి

ఈ నెల 31లోగా పూర్తి చేస్తాం



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో వ్యవసాయ గణన చేయిస్తున్నాం. దీని వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న పథకాలకు అనుగుణంగా ఈ పంటల వివరాల లెక్కల సేకరణ జరుగుతోంది. ఈ నెలాఖరులోపు సర్వే పూర్తి చేస్తాం.

– బి.వెంకటేష్, మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ అధికారి

ప్రముఖ గణిత శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ రావు కన్నుమూత

- అనారోగ్యంతో అమెరికాలో తుదిశ్వాస
- గణిత శాస్త్రంలో నోబెల్‌కు సమానమైన అవార్డును అందుకున్న సీఆర్ రావు
- పద్మభూషణ్, పద్మవిభూషణ్‌తో సత్కరించిన భారత ప్రభుత్వం



ఏయూ క్యాంపస్/డాబాగార్డెన్స్: ప్రపంచ ప్రఖ్యాత గణాంక, గణిత శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ రావు (102) కన్నుమూశారు. అమెరికాలో ఉన్న ఆయన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. 1920 సెప్టెంబర్ 10న కర్ణాటకలోని బళ్లారి జిల్లా హడగళిలో కల్యంపూడి రాధాకృష్ణా రావు (సీఆర్ రావు) తెలుగు కుటుంబంలో జన్మించారు. తర్వాత ఏపీలోని గూడూరు, నూజివీడు, నందిగామల్లో ఆయన బాల్యం గడిచింది. విశాఖలోని ఏవీఎన్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1940లో ఏయూలో గణిత శాస్త్రం అభ్యసించారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతాలో ఎంఏ స్టాటస్టిక్స్ చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోని కింగ్స్ కాలేజీలో 1948లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇండియన్ స్టాటస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా చేరి అదే సంస్థకు డైరెక్టర్‌గా ఎదిగారు. అక్కడ పదవీ విరమణ చేసిన అనంతరం అమెరికాలో స్థిరపడి అక్కడ యూనివర్సిటీ ఆఫ్ బఫెలోలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఆయన 19 దేశాల నుంచి 39 డాక్టరేట్లు అందుకున్నారు. 477 పరిశోధన పత్రాలను సమర్పించారు. 15 పుస్తకాలు రాశారు. 2002లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ చేతుల మీదుగా ఆ దేశ అత్యున్నత నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ పురస్కారాన్ని అందుకున్నారు. యూకే ఇంటర్నేషనల్ స్టాటస్టికల్ ఇన్‌స్టిట్యూట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్స్, ఇంటర్నేషనల్ బయోమెట్రిక్ సొసైటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. భారత స్టాటస్టిక్స్ రంగానికి ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆయనను 1968లో పద్మభూషణ్, 2001లో పద్మవిభూషణ్‌తో సత్కరించింది. ఎస్ఎస్ భట్నాగర్ పురస్కారాన్ని కూడా సీఆర్ రావు అందుకున్నారు. ఆయన 2020 సెప్టెంబర్ 10న 100వ పుట్టినరోజును జరుపుకున్నారు.

స్టాటస్టిక్స్‌లో నోబెల్ అంతటి గౌరవం


సీఆర్ రావుకు 75 ఏళ్ల కిందట గణాంక రంగంలో విప్లవాత్మకమైన ఆలోచనలకు బీజం వేసినందుకు గాను ఆ రంగంలో నోబెల్ బహుమతికి సమానమైన ఇంటర్నేషనల్ ప్రైజ్ ఆఫ్ స్టాటస్టిక్స్–2023 అవార్డును అందజేశారు. 102 ఏళ్ల వయసులో ఈ ఏడాదే ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 1945లో కోల్‌కతా మ్యాథమెటికల్ సొసైటీలో ప్రచురితమైన సీఆర్ రావు పరిశోధన పత్రానికి ఈ అవార్డు దక్కింది. ఆయన చేసిన కృషి..ఇప్పటికీ సైన్స్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ ఉందని ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటస్టిక్ ఫౌండేషన్ తెలిపింది.

ఎన్టీపీసీ రెండోయూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం

100 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసిన యూనిట్

జ్యోతినగర్ (కరీంనగర్): ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టుతో రాష్ట్రానికి మరిన్ని వెలుగులు ప్రసరించనున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ప్రాజెక్ట్‌లోని 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసే రెండోయూనిట్ బుధవారం ప్రారంభమైంది. ఈ మేరకు ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు, జనరల్ మేనేజర్లు అతుల్ కమలాకర్ దేశాయ్, అనుపమ్ ముఖర్జీ, మోహన్‌రెడ్డి, సంతోశ్ తివారీ, అర్పన్‌దాస్ గుప్తా, సీనియర్ అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. రెండో యూనిట్ సింక్రనైజేషన్ విజయవంతంగా పూర్తికావడంతో వీరంతా అభినందనలు తెలుపుకున్నారు. కాగా, ప్రారంభమైన విద్యుదుత్పత్తి రెండో యూనిట్ తొలిరోజే 100 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది.

మార్చిలో తొలి యూనిట్ సింక్రనైజేషన్: తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ–1లోని 800 మెగావాట్ల మొదటి యూనిట్‌ను ఈ ఏడాది మార్చి 24న సింక్రనైజేషన్ చేశారు. మొదటగా 104.9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చారు. జూలై 23న పూర్తిస్థాయిలో 801.2 మెగావాట్ల ఉత్పత్తికి చేరుకుంది. 72 గంటల నిరంతర విద్యుదుత్పత్తి అనంతరం గ్రిడ్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ నెల 27 నుంచి గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా ట్రాన్స్‌కోలోని లోడ్ డిస్పాచ్ సెంటర్(ఎల్డీసీ) నుంచి స్లాట్లను పొందింది.



మహిళా రిజర్వేషన్లు నా ఇంటి సమస్య కాదు

మహిళా హక్కులపై 'కాంగ్రెస్' బీజేపీది ఒకే వైఖరి: కవిత



సాక్షి, హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ల అంశం తన ఇంటి సమస్య కాదని.. ఇది దేశ మహిళలకు సంబంధించినదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహిళా బిల్లు కోసం జంతర్‌మంతర్ వద్ద తాను ధర్నా చేసినప్పుడు కలిసిరాని పార్టీలు, నాయకులు ఇప్పుడు స్పందించడం మహిళా బిల్లు ప్రాధాన్యతను తెలియజేస్తోందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత మీడియాతో మాట్లాడారు. చట్టం ద్వారానే చట్టసభల్లో మహిళల ప్రాతినిథ్యం పెరుగుతుందని, అయితే మహిళల హక్కులపై కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే అన్న రీతిలో వ్యవహరిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ 2014 వరకు అధికారంలో ఉన్నా లోక్‌భలో ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు. పదేళ్లుగా మహిళాబిల్లుపై ప్రధాని మోదీని కాంగ్రెస్ నేతలు సోనియా, ప్రియాంక ఎందుకు నిలదీయలేదన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో మరోమారు తాను ఢిల్లీ జంతర్‌మంతర్‌లో చేసే ధర్నాకు సోనియా, ప్రియాంకతోపాటు కేంద్రమంత్రి స్మృతి ఇరానీని కూడా ఆహ్వానిస్తానని ప్రకటించారు.

70 కోట్ల మంది మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకం

మహిళాబిల్లు ఆమోదం పొందకపోవడంతో దేశంలోని 70 కోట్ల మంది మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా హక్కులపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చాలా అవహేళనగా మాట్లాడారని కవి త ఆగ్రహం వ్యక్తం చేశారు.



సమావేశంలో రాకేశ్ శర్మ, కేఆర్‌పీ రెడ్డి, హర్మస్జి కామ, మేరీ పాల్

హైదరాబాద్‌లో ఐఎన్ఎస్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: భారత పత్రికల సమాఖ్య (ఐఎన్ఎస్) సదస్సు పదిహేనేళ్ల తర్వాత హైదరాబాద్‌లో సమాఖ్య అధ్యక్షుడు కేఆర్‌పీ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. పత్రిక పరిశ్రమకు ఐఎన్ఎస్ అపెక్స్ కో ఆర్డినేషన్ సంస్థగా పనిచేస్తూ.. పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలను చర్చించి, వాటిని పరిష్కరించడం, అవసరమైన వాటిని ప్రభుత్వ విభాగాల దృష్టికి తీసుకొని వెళ్తుంది. బుధవారం జరిగిన సదస్సులో కేఆర్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాకేశ్‌శర్మ, సెక్రెటరీ జనరల్ మేరీ పాల్, అడ్వర్టైజ్‌మెంట్ కమిటీ చైర్మన్ హర్మస్జి కామ, రీజినల్ అడ్వర్టైజ్‌మెంట్ కమిటీ చైర్మన్ స్థానిక అక్రెడిటెడ్ అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలు, స్థానిక ఐఎన్ఎస్ పబ్లికేషన్‌తో సంప్రదింపులు జరిపి వారి నుంచి పలు అంశాలపై సమాచారం సేకరించారు. జీఎస్టీ, వాణిజ్య, ప్రభుత్వాల నుంచి రావాల్సిన ప్రకటనల చెల్లింపులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి కొన్నింటికి పరిష్కారాలు కనుగొన్నట్లు కేఆర్‌పీ రెడ్డి తెలిపారు.

జిల్లా వార్తలు

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన



ఖమ్మంమయూరి సెంటర్/సూపర్‌బజార్ (కొత్తగూడెం): రాష్ట్ర రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 10.30 గంటలకు రామవరంలో మల్టీ యుటిలిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. 11 గంటలకు కొత్తగూడెం యూనియన్ బ్యాంక్ నుంచి రైతు బజార్ వరకు నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. 11.15 గంటలకు పాల్వంచ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడతారు. మధ్యాహ్నం 12 గంటలకు నవభారత్‌లోని ఐడీఓసీలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నియామకపత్రాలు అందజేస్తారు. జీవో 58 కింద లబ్ధిదారులకు పట్టాలను, ఎస్సీ వెల్ఫేర్ కింద ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. దివ్యాంగులకు పెంచిన ఆసరా పెన్షన్లను అందజేస్తారు. సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని శ్రీనివాసనగర్‌లోని సీపీ కార్యాలయంలో హైమాస్ట్ ఫ్లాగ్ పోల్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఖమ్మం పోలీస్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తారు. అలాగే వరదల సమయంలో పనిచేసిన పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు రశీదు అందజేస్తున్న ఆలయ అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్ తిలక్‌నగర్‌కు చెందిన భక్తులు కె.ప్రశాంత్ భరద్వాజ్ బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్కు ఆలయ అధికారులకు అందించగా వారు రశీదు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళారుల దారుణాలు

- పంట రుణాల పేరిట యథేచ్ఛగా వడ్డీ దందా
- రూ.లక్షల్లో చేతులు మారుతున్న నగదు
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- సాధారణ విషయంగా తీసుకుంటున్న బ్యాంకర్లు





బ్యాంకులో వినియోగదారులు (ఇన్‌సెట్) దళారీ వద్ద విత్‌డ్రా ఫారాలు

ఇల్లెందురూరల్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో అతివృష్టి, అనావృష్టి వెంటాడుతున్నా అన్నదాతలు భారం దేవుడిపైనే వేసి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. వాతావరణం అనుకూలించక కొందరు రైతులు రెండు, మూడు సార్లు విత్తనాలు విత్తుకోవడంతో పెట్టుబడి పెరుగుతోంది. దీనికితోడు విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగి పెట్టుబడి భారమైంది. ఈ క్రమంలో పంట రుణాలు రెన్యువల్ చేయించుకునేందుకు అన్నదాతలు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. ఇదే అదునుగా సొమ్ము చేసుకునేందుకు దళారులు రంగంలోకి దిగారు. అన్నదాతల పేరిట ఉన్న అప్పు చెల్లించి.. మళ్లీ కొత్త రుణం మంజూరు చేయిస్తున్నారు. ఈక్రమంలో వడ్డీ పేరిట నగదు వసూలు చేస్తున్నారు. ఫలితంగా అన్నదాతలు రూ.లక్షల్లో నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

బ్యాంకు సేవల కోసం సుదూర ప్రయాణం

ఇల్లెందు మండలంలోని కొమరారం, పోలారం, మాణిక్యారం, మర్రిగూడెం, పోచారంతండా, బోయితండా గ్రామ పంచాయతీల ఆర్థిక కార్యకలాపాలు యూనియన్ బ్యాంకు పరిధిలోకి వస్తాయి. అయితే యూనియన్ బ్యాంకు బ్రాంచ్ ఇల్లెందులోనే ఉండడంతో సుమారు 15 నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణిస్తే తప్ప ప్రజలు బ్యాంకుకు చేరలేరు. ఎటులేదన్నా మూడు, నాలుగు రోజులు పనులు ఆపేసి బ్యాంకుకు వచ్చివెళ్తేనే రుణం రెన్యువల్ పూర్తవుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు గతంలో కొమరారం కేంద్రంగా మినీ బ్యాంకు ఏర్పాటు చేసినా సేవలు ఆచరణలోకి రాలేదు.

పెట్టుబడిదారులదే రాజ్యం

ప్రభుత్వం రైతుబంధు అమలు చేస్తున్నా.. బ్యాంకర్లు పంట రుణాలు అందిస్తున్నా ఇల్లెందు ఏజెన్సీలో పెట్టుబడిదారులదే రాజ్యమైంది. రైతులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నట్లు చెబుతూ పెట్టుబడిదారులే వడ్డీకి నగదు ఇస్తున్నారు. రైతుబంధు ఖాతాల్లో జమ అయినా పాత అప్పుల పేరుతో బ్యాంకర్లు ఖాతాను హోల్డ్‌లో పెట్టడం వంటి కారణాలతో పంట రుణాల కోసం అనివార్యంగా దళారులను ఆశ్రయిస్తున్న రైతులు వారు చెప్పిన వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

అందరికీ తెలిసే..

పంట రుణం కోసం బ్యాంకుల వద్దకు చేరుకుంటున్న రైతులకు దళారుల సహకారం లేనిదే కాసులు చేతికందడం లేదు. దరఖాస్తు మొదలు డబ్బు అందే వరకు దళారులు అన్నీ తామై వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రైతులకు సంబంధించిన అప్పు చెల్లించినందున వడ్డీ రూపేణా రోజుకు రూ.వందకు రూ.3 చొప్పున వసూలు చేస్తున్నారు. అలాగే, దరఖాస్తు ఫారం నింపడం, పాత రుణం చెల్లింపు, కొత్త రుణం ఇప్పిస్తామంటూ మరికొందరు దండుకుంటున్నారు. ఇవేకాక కొత్త రుణం కోసమైతే ఏకంగా రూ.10 వేలకు పైగానే వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కాగా, బ్యాంకుల నిబంధనల మేరకు దళారులను లోపలకు రాకుండా చర్యలు చేపట్టాలి. కానీ, అప్పుల వసూళ్ల లక్ష్యం కారణంగా అధికారులు చూసీచూడనట్లుగా వదిలేసున్నారని తెలుస్తోంది. కాగా, ఈ పరిస్థితి ఇల్లెందులో మాత్రమే కాకుండా అన్ని ప్రాంతాల్లోని బ్యాంకుల వద్ద ఉందని.. రైతుల నుంచి దళారులు అందిన కాడికి దండుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మా దృష్టికి వచ్చింది..



పంట రుణాల కోసం రైతులు నేరుగా వస్తే సేవలందిస్తాం. కానీ, కొందరు రైతులు అప్పులు చెల్లించలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. వారి సహకారంతో పాత రుణం చెల్లించి కొత్త రుణం తీసుకుంటున్నారు. ఇలాంటి లావాదేవీలు జరుగుతున్నాయని మా దృష్టికి వచ్చింది. కానీ, అవన్నీ బ్యాంకు బయటే జరుగుతుండటంతో మేం చర్యలు తీసుకోలేకపోతున్నాం. బ్యాంకులో మాత్రం ఎలాంటి లావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

–లోహిత్, బ్రాంచ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్, ఇల్లెందు

బీసీలకు అండగా ఉంటా

- మంత్రి అజయ్‌కుమార్
- జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించిన కృష్ణయ్య



జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కృష్ణయ్య, పక్కన మంత్రి అజయ్

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీలకు అండగా ఉంటానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మమత ఆస్పత్రి రోడ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యాలయాన్ని బుధవారం సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ తన గెలుపులో ప్రతీసారి బీసీలే ముందుంటారని, ప్రతీ విషయంలో వారికి తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని అన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాధికారంలో ఇప్పటికీ బీసీలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని పేర్కొన్నారు. ఒంట్లో చివరి రక్తపు బొట్టు వరకు బీసీ సమాజ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ బీసీ గురుకులాలు తెచ్చుకున్నామని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, ఆర్జేసీ కృష్ణ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, మోదేపల్లి కృష్ణమాచారి, నీలం వెంకటేష్, అశోక్, రామకృష్ణ, అన్నవరపు నాగరామాచారి, యమా రవి, లింగబోయిన పుల్లారావు, రామ్మూర్తి, సుగుణ, బ్రహ్మం, రెడ్డిమల్ల వెంకటేశ్వరావు, రాకేష్ దత్త తదితరులు పాల్గొన్నారు. అనంతరం కృష్ణయ్యను వైఎస్సార్ అభిమాని జిల్లేపల్లి సైదులు కలిశారు.

నేడు 'ఎస్అండ్ పీసీ ఎంప్లాయీస్' ఎన్నికలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

7 పోస్టులు.. 14 మంది పోటీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని ఎస్అండ్‌పీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, ట్రెజరర్, సెక్రటరీతో పాటు ముగ్గురు డైరెక్టర్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఏడు పోస్టులకు గాను 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ఒక వర్గానికి టీబీజీకేఎస్, బీఎంఎస్, ఎస్సీ, ఎస్టీ అసోషియేషన్లు మద్దతు పలుకుతుండగా, మరో వర్గాన్ని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ యూనియన్లు బలపరుస్తున్నాయి. సుమారు రూ.12 కోట్ల టర్నోవర్‌తో నడిచే ఈ సొసైటీలో 300 మంది సభ్యులు ఉండగా, వారిలో 215 మంది నేటి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ సంవత్సరమే చేరిన 85 మంది సభ్యులు ప్రస్తుత ఎన్నికల్లో పాల్గొనరాదనే నిబంధనలు ఉండడంతో వారు పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ఈ సొసైటీ కాలపరిమితి ఐదు సంవత్సరాలు ఉంటుంది. గత ఎన్నికలు 2020 మార్చిలో జరిగాయి. అయితే గెలుపొందిన పాలక మండలి అంతర్గత కలహాలతో కొందరు డైరెక్టర్లు రాజీనామా చేయడంతో 2025లో జరుగాల్సిన ఈ ఎన్నికలను ఇప్పుడే నిర్వహిస్తున్నారు.

గోదావరి @30

భద్రాచలంఅర్బన్: ఇటీవల రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చింది. ఈ నెల 18న 13 అడుగులుగా ఉన్న నీటిమట్టం, ఈ నెల 22 తేదీన 32.6 అడుగులకు చేరింది. బుధవారం నుంచి తగ్గుముఖం పట్టి సాయంత్రం 5 గంటలకు 30 అడుగులకు చేరింది.

సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలి

నాబార్డు సీజీఎం సుశీల

అశ్వారావుపేటరూరల్: సేంద్రియ సాగు ఆరోగ్యవంతమైన వ్యవసాయమని, ప్రతీ రైతు దృష్టి పెట్టాలని నాబార్డు సీజీఎం సుశీల పేర్కొన్నారు. మండలంలోని పండువారిగూడెం గ్రామంలో నాబార్డు నిధులతో మల్లాయిగూడెం జీవ కమిటీ, వాసన్ ఆధ్వర్యంలో గోమూత్రం, గోవుపేడ, పుట్టమట్టి, పప్పుదినుసుల పిండి, నీటి మిశ్రమంతో జీవామృతం తయారీ చేసే జీవ వనరుల కేంద్రాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ సాగుతో అశ్వారావుపేటను ఐశ్వర్యపేటగా మార్చుకోవచ్చని సూచించారు. భూమికి పోషకాలు అందించి ఆరోగ్యవంతమైన నేలలుగా మార్చాలని, నేలను కాపాడుకుంటే ముందు తరాల వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుదని వివరించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ దత్తత గ్రామమైన గోగులపూడిలో పర్యటించి, కొండరెడ్లకు పిండి మిల్లును అందించారు. దేశీయ విత్తనాలు, ఆర్గానిక్ కూరగాయలు, వ్యవసాయ పనిముట్లను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో డీజీఎం శ్వేత సింగ్, ఉమ్మడి జిల్లా నాబార్డు అధికారి సుజిత్ కుమార్, స్థానిక ఏజీ కళాశాల ప్రొఫెసర్లు వెంకన్న, రెడ్డిప్రియ, వాసన్ ప్రతినిధి సతీష్ కుమార్, సభ్యులు దారా ప్రసాద్, కొర్రి మల్లయ్య, రాము, దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.



జీవ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు సీజీఎం సుశీల